క్లుప్తంగా

లక్ష్మి వెంకటేశ్వరునికి సువర్ణ కానుక



ఆలయ ప్రతినిధులకు సువర్ణ కానుకను అందజేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి భక్తులు మంగళవారం సువర్ణ కానుక అందజేశారు. నగరానికి చెందిన కృష్ణారెడ్డి దంపతులు మొక్కు తీర్చుకోవడంలో భాగంగా స్వామి ఆలయ ప్రాంగణంలో 11 గ్రాముల బంగారు (వైష్ణవ) మాంగల్యాన్ని సమర్పించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల సూపరింటెండెంట్ వెంకటేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు ఈ కానుకను స్వీకరించారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తామని వివరించారు. ఆసక్తి గల మహిళలు ఫిబ్రవరి 1 లోపల దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9396161936 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

దాతలు ముందుకు రావాలి

కడప ఎడ్యుకేషన్: ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేందుకు మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాలని కృష్ణాజిల్లా మదర్ థెరిస్సా ఫర్ డెఫ్ రీచ్ సొసైటీ జనరల్ సెక్రటరీ నాగులపాటి సోమేశ్వర్ రావు అన్నారు. నగరంలోని ఖాజా మొహిద్దీన్ అనే 70 సంవత్సరాల చెవిటి, మూగ, అంగవైకల్యంతోపాటు పేదరికంతో బాధపడుతున్నారని తమ దృష్టికి రావడంతో రూ. 1000 డబ్బులతోపాటు 25 కిలోల బియ్యం ప్యాకెట్‌ను వితరణంగా అందచేశారు. సోమేశ్వరావుకు బాధితుడు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాషా, జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

31న ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: పీఎఫ్ కార్యాలయం ఎదుట ఈ నెల 31న ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులకు గత సంవత్సరం జనవరి నుంచి రావాల్సిన పీఎఫ్ నిధులును పిఎఫ్ కార్యాలయ సిబ్బంది నిలిపివేశారన్నారు. ఏపీజీబీ బ్యాంకుకు రావాల్సిన నిధులను తక్షణమే బ్యాంకు పెన్షన్ ఫండ్ ట్రస్టుకు బదిలీ చేసి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న ధర్నాకు ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ జట్టు పయనం



కడప స్పోర్ట్స్: విశాఖపట్నంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీ ల్లో పాల్గొనేందుకు జిల్లా కబడ్డీ జట్టు పయనమైంది. మంగళవారం నగరంలోని బసవతారకం న్యాయ కళాశాలలో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కోచ్ జనార్దన్ క్రీడాకారులకు ట్రావెలింగ్ చార్జీలు అందజేసి పంపారు. పురుషుల జట్టు కెప్టెన్‌గా శివగణేష్‌రెడ్డి, మహిళల జట్టుకు రుక్సాన కెప్టెన్‌గా వ్యవహరిస్తారని వారు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కడప అర్బన్: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేట సర్కిల్‌లో మంగళవారం సాయంత్రం సీఐ సయ్యద్ హాసం తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనదారుడిని క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్లపైకి వచ్చేటపుడు ప్రతి ఒక్కరూ లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సీఐ వివరించారు.

ఆడపిల్ల బరువు కాదు.. బాధ్యత



చిన్నారిచే కేక్ కట్ చేయిస్తున్న మెడికల్ ఆఫీసర్ స్వర్ణ

కడప కల్చరల్ : ఆడపిల్లల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం నేటి సమాజంలో పెరిగిందని మెడికల్ ఆఫీసర్ జి.స్వర్ణ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరం అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో చిన్నారిచే కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను సురక్షితమైన, ప్రగతిశీల, సంతోషకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచాలన్నది అందరి ఆశయంగా భావిస్తున్నామన్నారు. 25వ డివిజన్ హెల్త్ సెక్రటరీ జి.కవిత మాట్లాడారు. సంస్థ నిర్వాహకులు మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఈ కేంద్రంలో పలు కార్యక్రమాల ద్వారా మానసిక, దివ్యాంగ పిల్లల చైతన్యం కోసం ఎవరికి వారు స్వీయ రక్షణ చేసుకునేలా శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు.

కమలాపురం : ఆడపిల్లను పుట్టనిద్దాం... బతకనిద్దాం... అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి తెలిపారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో మహిళలు రాణిస్తున్నారని, మహిళలు, పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. ఆడపిల్ల పుడితే నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తు అంతా బాలికలదేనన్నారు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతక నిద్దాం..అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు జ్యోతి, లక్ష్మీదేవి, గౌసియా, కిరణ్ కుమారి, వెంకటలక్ష్మి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక అంశాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. వివిధ సబ్జెక్టుల అధ్యాపకురాళ్లు మాట్లాడారు.



కమలాపురంలో జరిగిన బేటి బచావో-బేటి పడావో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది

నేటి నుంచి బోటు షికారు



బోటులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

కడప కల్చరల్: దేవునికడప సమీపంలోగల చెరువులో బుధవారం నుంచి మళ్లీ బోటు షికారు ప్రారంభం కానుంది. రెండు నెలలుగా అక్కడ బోటుషికారు బంద్ అయిన విషయాన్ని సాక్షి ఈనెల 6న ప్రత్యేక కథనంగా ప్రచురించింది. పలు ప్రజా సంఘాలు కూడా సాక్షి వార్త కథనాల కటింగ్‌లతో జిల్లా స్థాయి అధికారులకు బోటింగ్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి బుధవారం నుంచి బోటుషికారు జరిగేలా చర్యలు చేపట్టారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి చెరువులో జరుగుతుండిన బోటు షికారు కాలక్రమంలో బోట్లు పాత బడి మూలన పడడంతో కొత్త బోట్లు లేక కార్యక్రమాలు స్తంభించిపోయాయి. సాక్షి కథనంతో అధికారులు ప్రస్తుతానికి నాలుగు సీట్ల స్పీడ్ బోటును తెప్పించారు. మంగళవారం చెరువు నీటిలో బోటు స్పీడు, ఇతర సమస్యలను పరిశీలించేందుకు స్వయంగా బోటులో చెరువు నీటిలో విహరించి బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో బుధవారం ఆ శాఖ అధికారులు బోటింగ్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. ప్రస్తుతం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న కారణంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఈ సందర్భంగా వారు బోటు షికారు వైపు మొగ్గుచూపుతారు. ఇలాంటి డిమాండ్ ఉన్న సమయంలో బోటు షికారు తిరిగి ప్రారంభించడంపై అన్ని రంగాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగింపు హర్షణీయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్, మహిళా నాయకురాలు చైతన్య అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌ప్లాన్ వల్ల దళిత వాడలు అభివృద్ధి చెందుతాయని, దళిత వర్గాల ఆర్థిక పురోభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రికి దళిత వర్గాల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు చైతన్య, కార్పొరేటర్ చెన్నయ్య, బేడ, బుడగ జంగం నాయకులు పస్తం అంజి, శ్యాంసన్, బండి రమణ, బల్లిచిన్ని, రాజా, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు రామక్రిష్ణ, సుశీలమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోస్, ఏఆర్ మూర్తి కోరారు. మంగళవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి యూనియన్ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు నెల నుంచి ఉద్యోగులకు రావాల్సిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఓటీ అలవెన్సులు చెల్లించాలని కోరామన్నారు. అలాగే ఈనెల నుంచి ఏ నెలకు ఆ నెలలో అలవెన్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మెకానిక్‌ల కొరతను పరిష్కరించాలన్నారు. వీటితో ఇతర అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఆర్ ఎంను కోరారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై అవగాహన అవసరం



పుస్తకాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక అయేషా స్కూల్‌లో ఏపీ మైనార్టీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మన్సూర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని గూర్చి సంక్షిప్తంగా రాసిన పుస్తకాలను ఆయన విద్యార్థులకు అందజేశారు. స్కూల్ అధ్యక్షులు మజహర్ అలీఖాన్, సెక్రటరీ ఖలీముద్దీన్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అధికారం కల్లే

ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ పాదయాత్ర కాదు కదా పొర్లుదొండాలు పెట్టినా తెలుగుదేశం పార్టీ అధికారంలో రాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లాకు ఏం చేసిందో చెప్పాలన్నారు. జిల్లాలో ఒక్కటైనా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేశారా, చెప్పుకోదగిన అభివృద్ధి పనులు ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించారు. దివంగత వైఎస్సార్ జిల్లాలో ప్రారంభించిన ఏ ఒక్క పనిని కూడా టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదని మండిపడ్డారు. లోకేష్ తండ్రి చంద్రబాబు రాయలసీమ రౌడీలు, కడప గూండాలు అంటూ ప్రతిసారీ జిల్లా వాసులను అవమానించారన్న విషయాన్ని గుర్తు చేశారు. కడప జిల్లాపై ఇలాంటి ఏహ్య భావన ఉన్న తండ్రీ కొడుకులు ఏ మొఖం పెట్టుకొని జిల్లాలో పర్యటిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు ఎప్పటికీ టీడీపీని నమ్మబోరని తెలిపారు.

ఉపాధ్యాయులపై వేధింపులు సరికాదు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శన పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, షోకాజు నోటీసులు జారీ చేసి వేధించడం సబబు కాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మెన్ మాదన విజయ్ కుమార్, సెక్రటరీ జనరల్ షేక్ మొహమ్మద్ ఇర్షాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించడం, తనిఖీలు చేయడం మంచి పరిణామమేనని అయితే ఆ పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను వేధించడం తగదన్నారు. విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోపాలను స్నేహపూర్వ వాతావరణంలో సరిచేస్తూ విద్యా రంగాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అంగన్వాడీలకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలి

కమలాపురం : అంగన్వాడీలకు ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహార క్వాంటిటీని పెంచాలన్నారు. అంగన్వాడీ సెంటర్లలో వసతులు మెరుగు పరచాలని, పర్యవేక్షణ పేరుతో చేస్తున్న వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. గ్రామాల్లో నెట్ సౌకర్యం సరిగా లేదని, దీంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఫేస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ నాయకురాళ్లు సుబ్బలక్ష్మి, ఉమ, గాయత్రి, భారతి, శివలీల, రమాప్రభ, రాధిక, ఉషా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఇంటాక్ ప్రతినిధులు

కడప కల్చరల్ : ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) రూపొందించిన 2023 పర్యాటక క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ విజయరామరాజు జేసీ సాయికాంత్‌వర్మతో కలిసి ఆవిష్కరించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ ఎస్. ఎలియాస్‌రెడ్డి, కో కన్వీనర్ డాక్టర్ వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి రూపొందించిన ఈ క్యాలెండర్‌లో ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా పేరుగాంచిన గండికోట చిత్రాన్ని ప్రధానంగా ప్రచురించారు. దేశానికే తలమానికంగా నిలువనున్న గండికోట మన జిల్లాలో ఉండడం అదృష్టమని, జిల్లా వాసులకు గర్వకారణమని, అందుకే తాము దాన్ని ఈ సంవత్సరపు క్యాలెండర్‌లో ప్రధానంగా ప్రచురించామని వారు కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో పర్యాటకాభివృద్ధికి మరింత చేయూతనివ్వాలని కలెక్టర్ కోరుతూ మంచి ప్రయత్నం చేశారంటూ ఇంటాక్ బృందాన్ని అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించవద్దు

– హౌసింగ్ పీడీ కృష్ణయ్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ కృష్ణయ్య

చెన్నూరు : కనపర్తి జగనన్న లే అవుట్‌లలో చేపట్టబోయే ఇంటి నిర్మాణాల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ పీడీ ఎం.కృష్ణయ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం కనపర్తి జగనన్న లే అవుట్లలోని గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండలస్థాయి అధికారులు చొరవ తీసుకుని పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా లే అవుట్ నుంచి కొండపేట చెరువు వంక వరకు చేపట్టనున్న మెయిన్ డ్రైనేజీని ఆయన పరిశీలించారు. డ్రైనేజీలో ఉన్న నీటిని వంకలోకి వెళ్లే విధంగా చూడాలని ఆయన మండల అధికారులకు తెలియజేశారు. లే అవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణ పనుల విషయంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించాల్సిన అవసరం ఉందని ఆయన అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపీడీఓ సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ మేనిల్, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎత్తివేయాలి



అశోక్ నగర్లో రోడ్డుపై వేసిన వ్యర్థాలు

కడప కార్పొరేషన్: కడప నగరం చిన్నచౌకులోని అశోక్ నగర్‌లో డ్రైనేజీ కాలువ పగులగొట్టి రోడ్డుపై వేసిన వ్యర్థాలను ఎత్తివేయాలని స్థానికులు కోరుతున్నారు. డోర్ నంబర్ 36/363 సమీపంలో కొత్త డ్రైనేజీ కాలువ నిర్మించేందుకు పాత కాలువ పగులగొట్టి ఆ వ్యర్థాలను, మట్టిని రోడ్డుపై వేశారని, నెల రోజులవుతున్నా ఎత్తలేదన్నారు. రోడ్డుపై మట్టి, రాళ్లు ఉండటం వల్ల ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి ఈ వ్యర్థాలను ఎత్తివేయాలని వారు కోరుతున్నారు.

రైల్వే ప్రయాణికులకు భద్రత కల్పించాలి

– తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షాను



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ షేక్ షాను

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే ప్రయాణికులకు తగిన భద్రత కల్పించాలని తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షాను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆమె కడప రైల్వే పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆమె ఆర్‌పీఎఫ్ రైల్వే సిబ్బందితో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైళ్లలో నేరాలను నియంత్రించాలని, అలాగే రైల్వే ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కడప రైల్వే ఇన్‌స్పెక్టర్ మహమ్మద్‌బాబా, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలి

కమలాపురం : ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండలంలోని హెచ్ఎంలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన లిప్ కార్యక్రమంపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. డీఆర్‌పీలు లక్షుమయ్య, ఎంవీఎస్ రాజులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్ట్‌ల బోధనపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన లిప్ కార్యక్రమంపై అవగాహన పెంచుకుని విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠ్యాంశ బోధనలో టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల ప్రకారం బోధన సాగాలన్నారు. విద్యార్థులను ఏ, బీ గ్రేడులుగా విభజించి వారి విద్యాభివృద్ధిపై దృష్టి సారించి రికార్డులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల కేస్ స్టడీ నిర్వహణ చేపట్టాలన్నారు. రాష్ట్రస్థాయి నుంచి స్కూలు స్థాయి వరకు లిప్ మీద హెచ్ఎం, ఎంఈఓ, డీఆర్‌పీ, ఎస్ఆర్‌పీ, డిప్యూటీ ఈఓ, డీఈఓ, డైట్ లెక్చరర్స్, యూనిసెఫ్ బృందం పర్యవేక్షిస్తారన్నారు. లిప్ పై ప్రతి ఉపాధ్యాయుడు మంచి అవగాహన కలిగి ఉండి విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

సీఎం కప్ టోర్నమెంట్ విజయవంతం చేయాలి

– స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్

కడప స్పోర్ట్స్: సీఎం కప్ టోర్నమెంట్, ఎంపికలను విజయవంతం చేయాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ కోరారు. మంగళవారం కడప నగరంలోని స్టెప్ కార్యాలయంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్‌తో కలిసి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ ఈనెల 25, 27, 28 తేదీల్లో కడప నగరంతో పాటు రాయచోటిలో నిర్వహించనున్న సీఎం కప్ టోర్నమెంట్‌కు సహకారం అందించి విజయవంతం చేయాలని కోరారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ 2021 సీఎం కప్‌కు సంబంధించి నియోజకవర్గస్థాయి ఎంపికలు గతంలోనే పూర్తయ్యాయని, వాటికి సంబంధించి జిల్లా స్థాయి టోర్నమెంట్, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప డీఎస్ఏ మైదానం, వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, రాయచోటి జెడ్పీ హైస్కూల్‌లో ఈ టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, కోచ్‌లు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రభుత్వాలు అవలంబిస్తున్న హమాలీ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ పోరాటాలు చేసేందుకు జనవరి 29, 30, 31 తేదీల్లో తిరుపతిలో హమాలీల మూడవ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం కడపలోని రైల్వే గూడ్స్ షెడ్ కార్యాలయం వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్, చిన్న ఓబులేశు, రంగయ్య, సుబ్బారావు, సూరి, నాగేంద్ర, రంగనాయకులు,మల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి

– ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛ కడపపై అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అప్పుడే పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని కడప మున్సిపల్ కార్పొరేషన్ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛ కడపపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారు నివసిస్తున్న ఇంటితోపాటు చదువుతున్న కళాశాలలో స్వచ్ఛతను పాటిస్తే స్వచ్ఛ కడపను సాధించడం సులభం అవుతుందన్నారు. వివిధ విభాగాల అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హోమియోలో అద్భుత చికిత్సలు

కమలాపురం : అన్ని రోగాలకు హోమియో వైద్యంలో అద్భుత చికిత్సలు ఉన్నాయని ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సైతం మంచి చికిత్సలు ఉన్నాయన్నారు. కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళ, గురు, శనివారాలలో అందుబాటులో ఉంటామని, హోమియో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కినేని కుటుంబంపై బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు

కడప కార్పొరేషన్: అక్కినేని కుటుంబంపై నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికాదని కడప అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ నాయకులు ప్రేమ్ నగర్ చందు అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన సినిమా అపజయాన్ని జీర్ణించుకోలేని బాలక్రిష్ణ అ ఫ్రష్టేషన్‌ను అక్కినేని కుటుంబంపై చూపడం తగదన్నారు. ఎన్‌టీ రామారావు నట వారసుడిగా వచ్చిన బాలక్రిష్ణ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. బాలక్రిష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలి

చింతకొమ్మదిన్నె : మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల సంరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. మహిళలు శారీరకంగా, దృఢంగా, మానసికంగా, ఆర్థికంగా పురోగతిని సాధించాలన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు దిశ యాప్‌ను ఖచ్చితంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సంరక్షణ కమిటీ సభ్యులు పర్వీన్, నిర్మల, కళ్యాణ పల్లవి, పరిమళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

– జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప ఎడ్యుకేషన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గాంధీనగర్ హైస్కూల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలల, జువైనల్ కేర్, ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య గురించి వివరించారు. అలాగే పిల్లలకు సంబంధించిన 1098, మహిళలకు 181, సీనియర్ సిటిజన్‌లకు 14567 టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. హెడ్‌మాస్టర్ సత్యసుజాతమ్మ, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయాన్ని పునర్నిర్మించడంలో భాగంగా బుధవారం స్వామి మూల విరాట్‌ను బాల ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. ఉదయం 8 నుంచి 9.30 గంటల్లోపు ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన బాల ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ, నిర్మాణ కమిటీ ప్రతినిధులు శేషారెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి తెలిపారు. రెండు సంవత్సరాల్లో శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని పోలిన దేవాలయాన్ని ప్రస్తుతమున్న దేవాలయం స్థానంలో నిర్మించేందుకు నిర్మాణ కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు వారు తెలిపారు. బాల ఆలయం నిర్మాణ పనుల అనంతరం నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వారు వివరించారు.

ఆర్టీసీ సూపర్‌వైజర్‌కు గాయాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులోని కంట్రోల్ పాయింట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న విజయమ్మను స్కూటరిస్టు ఢీకొనడంతో గాయపడ్డారు. మంగళవారం విధుల నిర్వహణ నిమిత్తం బస్టాండులోకి వస్తుండగా ఎదురుగా వస్తున్న స్కూటరిస్టు విజయమ్మను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే అక్కడున్న సిబ్బంది నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.